క్లుప్తంగా

మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడిగా సాంబయ్య



ఖానాపురం : మున్నూరు కాపు సంఘం మండల అధ్యక్షుడిగా సాంబయ్య ఎన్నికయ్యాడు. మండల కేంద్రంలో నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. గౌరవ సలహాదారుగా భిక్షమయ్య, గౌరవ అధ్యక్షుడుగా శ్రీను, ఉపాధ్యక్షుడుగా సోమయ్య, కార్యదర్శిగా వెంకటేశ్వర్లు, కోశాధికారిగా ప్రకాశ్, సభ్యులుగా సత్యం, వెంకన్న, రవీందర్, వీరన్న, వెంకన్న, మోహన్, సురేష్, గాంధి, కొంరయ్య, చంద్రయ్య ఎన్నికయ్యారు. కార్యవర్గాన్ని సభ్యులు అభినందించారు.

నియామకం



నల్లబెల్లి : మండలంలోని నారక్కపేటలో కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ ఉపాధ్యక్షుడిగా శనిగరం ప్రదీప్ నియమితులయ్యారు. ఈ మేరకు ప్రదీప్‌కు గ్రామ కమిటీ అధ్యక్షుడు శ్రీపతి సుమన్ శనివారం నియామక పత్రం అందజేశారు. అనంతరం ప్రదీప్ మాట్లాడారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు.

నాటుసారా కేంద్రాలపై ఎక్సైజ్ దాడులు

నల్లబెల్లి : మండల కేంద్రంలోని సాటు సారా విక్రయ కేంద్రాలపై నర్సంపేట ఎక్సైజ్, వరంగల్ అర్బన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు శనివారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సీఐ నరేశ్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. 20 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని మూడు విజయ, గొర్రె సాంబలక్ష్మి, బోళ్ల సమ్మక్కపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నాటుసారా విక్రేతలను తహసీల్దార్ కృష్ణ ఎదుట బైండోవర్ చేయగా మరోసారి నాటుసారా విక్రయిస్తే జైలు శిక్ష విధిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో టాస్క్‌ఫోర్స్ ఎస్సై రమాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

4 నుంచి క్రీడా పోటీలు

గీసుకొండ : నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్ మైదానంలో ఈనెల 4 నుంచి రెండ్రోజుల పాటు బ్లాక్ స్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు కేంద్రం ప్రతినిధులు వెల్దండ సురేశ్, గాలి భిక్షపతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కబడ్డీ, వాలీబాల్, షటిల్, రన్నింగ్ పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన 18 నుంచి 29 ఏళ్ల వరకు వయస్సున్న యువత ఇతర వివరాల కోసం 9640881670 సెల్ నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

నివాళి



నర్సంపేట : పట్టణానికి చెందిన ప్రముఖ స్వాతంత్య్ర సమరయోధుడు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కీసరి ముత్తయ్య సతీమణి ముత్తమ్మ శనివారం అనారోగ్యంతో మృతి చెందగా ఆమె మృతదేహానికి టీపీసీసీ సభ్యుడు పెండెం రామానంద్, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, తదితరులు శనివారం వేర్వేరుగా పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో కాంగ్రెస్ పార్టీ పట్టణ కమిటీ అధ్యక్షుడు బత్తిని రాజేందర్, మాజీ మార్కెట్ చైర్మన్ ఎర్ర యాకూబ్‌రెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి మాదాసి రవికుమార్, బీఆర్ఎస్ నాయకులు, తదితరులున్నారు.

పరామర్శ



పర్వతగిరి : మండలంలోని గోరుగుట్టతండాకు చెందిన భానోతు సుబ్బ, భానోతు దస్రు నాయక్ రోడ్డు ప్రమాదంలో గాయాల పాలై హన్మకొండలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా వారిని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జాటోతు శ్రీనివాస్‌నాయక్ శనివారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మహమూద్ అలీ, ఎస్టీ సెల్ అధ్యక్షుడు భాస్కర్‌నాయక్, యూత్ కాంగ్రెస్ నాయకులు కొమ్ము రమేశ్, కాంగ్రెస్ నాయకులు భద్రినాయక్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో కారు డ్రైవర్‌కు గాయాలు

చెన్నారావుపేట : కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టగా డ్రైవర్ తీవ్ర గాయాలపాలైన ఘటన మండలంలోని తిమ్మరాయినిపహాడ్ గ్రామ రోడ్డులో శనివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఇలాసారపు సురేశ్ చెన్నారావుపేట నుంచి తిమ్మరాయినిపహాడ్‌కు కారులో వెళ్తుండగా రోడ్డు పనులు జరుగుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. దీంతో డ్రైవర్ సురేశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 ద్వారా క్షతగాత్రుడిని నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు.

వినూత్న పద్ధతులతో అధిక దిగుబడి

- నారుమడి సస్యరక్షణ చర్యలు
- 8 వేల ఎకరాల్లో వరి సాగు
- కలుపుతో జాగ్రత్త : నాగరాజు, ఏఓ





వరి నాట్లు వేస్తున్న కూలీలు

నెక్కొండ : వరి పంట సాగులో వినూత్న పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు ఖాయం. ఈ సీజన్‌లో చలి తీవ్రత పెరుగుతుండడంతో రైతులు వరి నారుమడి సంరక్షణ చర్యలు చేపట్టాలి. యాసంగిలో వరి నారుమడి సస్యరక్షణ చర్యలు తప్పనిసరి. వరిలో కలుపుతో జాగ్రత్తలు, అధిక ఎరువుల వాడకం తదితర విషయాలపై మండల వ్యవసాయ అధికారి (ఏఓ) ఎగిడి నాగరాజు సూచనలు చేశారు.

మండలంలో సుమారు 8 వేల ఎకరాల్లో వరి సాగవుతోందని చెప్పారు. రైతులు స్వల్పకాలిక పంట కాలం రకాలైన ఎంటీయూ–1010, కేఎస్ఎం–118, జేజీఎల్–24423, ఆర్ఎన్ఆర్–10548 ఎంచుకోవాలని సూచించారు. తద్వారా 120 రోజుల్లో పంట పూర్తి అవుతుందని చెప్పారు. చలి ప్రభావంతో వరినారు భూమిలో నుంచి సరైన పోషకాలను తీసుకోలేని పరిస్థితిలో నారు ఎరుపు, ఇటుక రంగులోకి మారి కుళ్లిపోయే ప్రమాదం ఉందన్నారు. రైతులు నారును ఎత్తుమడుల (బెడ్స్) విధానంలో పెంచాలని చెప్పారు. ఒక్కో బెడ్ వెడల్పు 3 మీటర్లు ఉండేలా చూడాలన్నారు. చలి ప్రభావాన్ని తట్టుకుని నారుమడి ఏపుగా పెరగడానికి అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ముందుగా కార్బండిజం ద్రావణంలో విత్తనాన్ని శుద్ధి చేయాలని, 24–48 గంటలపాటు విత్తనాలను నానబెట్టిన అనంతరం మండి కట్టిన తరువాతే నారుమడిలో చల్లాలని స్పష్టం చేశారు. ఎత్తైన నారుమడిలోనే వరి తుకం చల్లాలని, భూమిని బాగా దున్నిన తర్వాత పశువుల ఎరువు చల్లాలని సూచించారు. చలి తీవ్రతతో నారు చనిపోయే అవకాశం ఉన్న క్రమంలో రాత్రివేళలో మడిలో నీరుపెట్టి మరుసటి రోజు ఉదయమే నీటిని తొలగించి తాజా నీరు పెట్టాలని వివరించారు. రాత్రివేళల్లో నారుమడిపై మంచు పడకుండా నాలుగు వైపులా పాలిథిన్ కవర్లు కట్టాల్సిన అవసరం ఉందన్నారు. చీడపీడల నివారణ కోసం నారు 10–15 రోజుల వయస్సులో ఎకరాకు లీటరు నీటిలో చిలామిన్ జింక్ సల్ఫేట్ 2 గ్రాముల కలిపి పిచికారీ చేయాలని చెప్పారు. కాండం తొలుచు పురుగు నివారణ కోసం ఎకరా నారుమడికి కిలో కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు చల్లాలని తెలిపారు. అలాగే 25–30 రోజుల వయస్సు కలిగిన నారుమడినే నాటు వేయడానికి వాడాలని చెప్పారు. ముదురు నారు నాటితే దిగుబడి తగ్గుతుందన్నారు. నాట్లు వేసే సమయంలో నారు చివర్లను తుంచడంతోపాటు లీటరు నీళ్లకు క్లోరిఫైరిఫాస్ మిల్లీలీటరు చొప్పున మందు కలిపి 24–48 గంటలపాటు నిల్వ ఉంచి నాటాలని తెలిపారు. తద్వారా కాండం తొలుచు, మొగి, ఆకు చుట్టు పురుగులతోపాటు చుడి దోమ, ఉల్లికోడు వంటి వ్యాధుల నుంచి కాపాడొచ్చని తేటతెల్లం చేశారు.

వరిలో కలుపు జాగ్రత్తలు

కలుపు మొక్కలు గాలి, నీరు పోషకాలు, వెలుతురు కోసం వరిలో పోటీపడి పెరిగి వరి ఎదుగుదలను తగ్గిస్తుందని ఏఓ చెప్పారు. అలాగే కలుపు మొక్కలు చీడ పీడలకు ఆవాసంగా ఏర్పడి వివిధ రకాల తెగుళ్లు, చీడలు వరి ఆశిస్తాయన్నారు. వరి నాట్లు వేసిన రైతులు కలుపు నివారణ కోసం మొదటి దశలోనే చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ప్రధానంగా వరి నాటిన నెల రోజుల వరకు జాగ్రత్తలు పాటించాలని కోరారు. ఏఈఓల సూచనలు, సలహాల మేరకు మందులు పిచికారీ చేయాలన్నారు. కలుపు మందును ఇతర రసాయనాలతో కలిపి వాడవద్దని చెప్పారు. అలాగే నిత్యం ఒకే రకమైన కలుపు మందు వాడకూడదని సూచించారు.

గర్భిణులకు దంత సంరక్షణ కీలకం

- ప్రముఖ వైద్యనిపుణుడు భరత్‌రెడ్డి



మౌత్ వాష్‌లు అందజేస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ రామ్మూర్తి, డాక్టర్ భరత్‌రెడ్డి

వర్ధన్నపేట : గర్భిణులకు దంత సంరక్షణ కీలకమని ప్రముఖ దంత వైద్యనిపుణుడు డాక్టర భరత్‌రెడ్డి తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో దంత వైద్య విభాగం ఆధ్వర్యంలో గర్భిణుల కోసం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామ్మూర్తి, ఆర్ఎంఓ డాక్టర్ విజయ్‌కుమార్ చేతుల మీదుగా ఆయన మౌత్ వాష్ బాటిళ్లను ఫార్మసీకి శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ భరత్‌రెడ్డి మాట్లాడారు. గర్భిణుల్లో నోటి, దంత సంరక్షణ ముఖ్యమన్నారు. నిర్లక్ష్యం చేస్తే పోషకాహార లోపం తలెత్తి తక్కువ బరువులో, అనారోగ్య శిశువులు జన్మించే ప్రమాదం ఉందన్నారు. తప్పనిసరిగా రెండో త్రైమాసికంలో స్త్రీ వైద్య నిపుణుల సలహా మేరకు దంత వైద్యపరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు. హార్మోన్ల హెచ్చుతగ్గుల వల్ల కలిగే ఇన్‌ఫెక్షన్ నివారణ లక్ష్యంగా మౌత్ వాష్‌లు సూచిస్తున్నట్లు వివరించారు. చిగుళ్ల ద్వారా రక్తస్రావం చోటు చేసుకుని ఇబ్బంది పడుతున్న గర్భిణులు వెంటనే వైద్యున్ని సంప్రదిస్తే కారణాన్ని గుర్తించి చికిత్స చేస్తారని తెలిపారు. గర్భిణులు మెత్తని టూత్ బ్రష్‌లు మాత్రమే వాడాలని, రోజూ రెండు సార్లు బ్రష్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఫార్మసిస్టు విమల, శశికుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ పద్మ, సిబ్బంది పాల్గొన్నారు.

బడ్జెట్‌తో కార్పొరేట్ శక్తులకు భరోసా



బడ్జెట్ ప్రతులను దహనం చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

- రైతు సంఘం సహాయ కార్యదర్శి శోభన్

నర్సంపేట : కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన 2025–26 కేంద్ర బడ్జెట్ కార్పొరేట్ శక్తులకు భరోసా కలిగించేలా ఉందని రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడు శోభన్‌నాయక్, సీఐటీయూ రాష్ట్ర నాయకురాలు కాసు మాధవి అన్నారు. స్థానిక వరంగల్ రోడ్డులో బడ్జెట్ ప్రతులను ప్రజాసంఘాల నాయకులు శనివారం దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శోభన్, మాధవి మాట్లాడారు. బడ్జెట్‌ను కేంద్ర ప్రభుత్వం రాజకీయ అవసరాలకే ఉపయోగించుకుంటూ దేశ సమ్మిళిత వృద్ధిని విస్మరించిందని విమర్శించారు. ఢిల్లీ, బిహార్, ఆంధ్రప్రదేశ్ కోసమే బడ్జెట్ ప్రవేశపెట్టినట్లు ఉందని దుయ్యబట్టారు. ఇద్దరు కేంద్ర మంత్రులు, బీజేపీ ఎంపీలు ఉండి తెలంగాణ రాష్ట్రానికి ఏం సాధించారని ప్రశ్నించారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఈసంపల్లి బాబు, వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి భూక్యా సమ్మయ్య, జిల్లా నాయకులు కొరబోయిన కుమారస్వామి, హన్మకొండ శ్రీధర్, పుచ్చకాయల కృష్ణారెడ్డి, గడ్డమీది బాలకృష్ణ, కందికొండ రాజు, శ్రీనివాస్, బుర్రి ఆంజనేయులు, పిండి రాములు, నర్సింహారెడ్డి, సుధాకర్, ఎండీ.ఫరీదా, వజ్జంజి విజయ, బిట్ర స్వప్న, ఇప్ప సతీశ్, సారయ్య, కార్తీక్, అనిల్, విలియం, నెహ్రూ, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

కాలనీ సమగ్రాభివృద్ధికి కృషి

- ప్రముఖ వైద్యుడు రమేశ్



చిత్రపటాలు అందజేస్తున్న డాక్టర్ రమేశ్

నర్సంపేట : పట్టణంలోని మార్కండేయ కాలనీ సమగ్రాభివృద్ధికి కృషి చేస్తానని ప్రముఖ వైద్యుడు మార్త రమేశ్ తెలిపారు. పట్టణంలోని ఆ కాలనీ కార్యాలయంలో అధ్యక్షుడు పెండెం శివానంద్ ఆధ్వర్యంలో శనివారం మార్కండేయ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీవాసులకు డాక్టర్ రమేశ్ మార్కండేయ, వంశవృక్ష చిత్రపటాలు అందజేసి మాట్లాడారు. సొంత నిధులతో కాలనీని అభివృద్ధి చేసుకోవడం అభినందనీయమని చెప్పారు. కాలనీలో మార్కండేయ ఆలయ నిర్మాణానికి సహాయం అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం అసోసియేట్ అధ్యక్షుడు దుస్స శివశంకర్, రాష్ట్ర కార్యదర్శి వలపదాసు శ్యామ్, కాలనీ కార్యదర్శి సుభాశ్, యువజన సంఘం కార్యదర్శి పర్వ శ్రీధర్, తెలంగాణ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షురాలు తక్కళ్లపల్లి ఉమ, సర్వాపురం కార్యదర్శి సిరిమల్లె నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

భక్త మార్కండేయ జయంతి వేడుకలు



నల్లబెల్లి : మండల కేంద్రంలో పద్మశాలి కులస్తులు భక్త మార్కండేయ జయంతి వేడుకలు శనివారం నిర్వహించారు. మార్కండేయుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పీహెచ్‌సీలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం నాయకులు దశరథం, రమేశ్, అశోక్, స్వామి, రాజు, కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



చెన్నారావుపేట : జాతీయ మానవ హక్కుల కమిటీ (ఎన్‌హెచ్ఆర్‌సీ) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మొగుళ్ల భద్రయ్య ఆదేశాల మేరకు రాష్ట్ర కమిటీ క్యాలెండర్‌ను మండల కేంద్రంలో తహసీల్దార్ ఫణికుమార్, ఎంపీడీఓ శ్రీవాణి, ఎస్సై రాజేశ్‌రెడ్డి సమక్షంలో శనివారం ఆవిష్కరించారు. అనంతరం తహసీల్దార్, ఎంపీడీఓ, ఎస్సై మాట్లాడారు. కార్యక్రమంలో కమిటీ రాష్ట్ర ఈసీ సభ్యుడు భాస్కర్, జిల్లా అధ్యక్షుడు రవికిరణ్, జిల్లా ప్రధాన కార్యదర్శి సంగం రమేశ్, నాయకులు కోమండ్ల శ్రీనివాస్, నర్మెట్ట యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ సాధనే ధ్యేయం



నర్సంపేట : పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రణయ్‌దీప్, నాయకులు

- ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు ప్రణయ్‌దీప్

నర్సంపేట : మాదిగ కులస్తుల హక్కుల పరిరక్షణే ధ్యేయంగా 'లక్ష డప్పులు–వేల గొంతులు' సాంస్కృతిక ఉద్యమం చేపట్టినట్లు ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు కల్లెపల్లి ప్రణయ్‌దీప్, తడుగుల విజయ్ తెలిపారు. ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఈనెల 7న హైదరాబాద్‌లో నిర్వహించనున్న ఆ కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో శనివారం వారు ఆవిష్కరించి మాట్లాడారు. దేశవ్యాప్తంగా 16 రాష్ట్రాల నుంచి లక్షలాదిగా డప్పులతో మాదిగ ప్రజలు స్వచ్ఛందంగా తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు చింతం సిద్ధూ, అలువాల హరీశ్, మునిగె యాకూబ్, వేల్పుగొండ రాజు, మాదాసి బాబు, గుండేటి వీరేశం, రాజు, తదితరులు పాల్గొన్నారు.

దుగ్గొండి : మండల కేంద్రంలో వాల్‌పోస్టర్లను ఎమ్మార్పీఎస్ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల అధ్యక్షుడు మామునూరి శ్రీధర్ మాట్లాడారు. హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు తలపెట్టిన ర్యాలీకి అన్ని గ్రామాల నుంచి మాదిగ కులస్తులు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో మండల గౌరవ అధ్యక్షుడు కొలగాని రవి, నాయకులు గంగారపు రవీందర్, పర్లపెల్లి యుగందర్, నల్లబెల్లి శ్రీకాంత్, సందీప్, ఎర్రల్ల కమలాకర్, సునీల్, ప్రశాంత్, శ్రవణ్, అభినవ్ పాల్గొన్నారు.

రాయపర్తి : మండల కేంద్రంలో వాల్‌పోస్టర్లను ఎంఎస్‌పీ రాష్ట్ర నాయకుడు కందికట్ల విజయ్ పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. భారీ సాంస్కృతిక ప్రదర్శనకు అన్ని గ్రామాల నుంచి తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కంతుల జంపి, ఎంఎస్‌పీ జిల్లా కార్యదర్శి ఐత రాజు, మండల అధ్యక్షుడు వశపాక కుమార్, ప్రధాన కార్యదర్శి గారె నరేశ్, ఎంఈఎఫ్ నాయకుడు జేరుపోతుల యాకయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ ప్రాంగణాన్ని శుభ్రం చేయించండి



వర్ధన్నపేట : పట్టణంలోని బాలాంజనేయస్వామి ఆలయ ప్రాంగణాన్ని, పరిసరాలను శుభ్రం చేయించాలని కోరుతూ మున్సిపల్ అధికారులకు హనుమాన్ సేవా సమితి సభ్యులు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సభ్యులు అధికారికి సమస్యలు వివరించారు. బాలాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో, పరిసరాల్లో చెత్తాచెదారం పేరుకుపోయి దుర్వాసన వస్తోందని తెలిపారు. ఆలయానికి వచ్చే భక్తులు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. అధికారులు వెంటనే స్పందించి ఆలయ పరిసరాల్లో చెత్తాచెదారంతో తొలగించేలా పారిశుద్ధ్య పనులు చేయించాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సమితి సభ్యులు ఆరెల్లి నాగర్జున్, రామగిరి విష్ణు, క్రాంతికుమార్, పూజారి రాజు, దాసరా రాజు, వాశికర్ల శేఖర్, మణిదీప్, తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం, టీచర్లు

నర్సంపేట : నేషనల్ గ్రీన్ కార్ప్స్ సౌజన్యంతో జిల్లా విద్యాశాఖ, జిల్లా విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన భౌతిక శాస్త్ర ఆన్‌లైన్ పోటీల్లో జెడ్పీ బాలికల హైస్కూల్ విద్యార్థులు రియాజ్ సుల్తానా, అఖిలేశ్వర్, స్పందన, సిరిచందన జిల్లా, మండల స్థాయిలో ప్రథమ బహుమతి సాధించి ప్రశంసా పత్రాలతోపాటు రూ.3వేల నగదు అందుకున్నారని హెచ్ఎం కాంతారావు తెలిపారు. ప్రతిభ చాటిన విద్యార్థులను స్కూల్ ఆవరణలో ఉపాధ్యాయులతో కలిసి హెచ్ఎం కాంతారావు అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడారు. నైపుణ్యాలను పెంచుకుంటే వ్యర్థాల నుంచి సంపదను సృష్టించడంతోపాటు పర్యావరణాన్ని పరిరక్షించవచ్చని తెలిపారు. జీవితంలో ఎదురయ్యే అనేక సమస్యల పరిష్కారంలో భౌతికశాస్త్రం కీలకపాత్ర పోషిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అరుణకుమారి, రాజేశ్, వాణి, రవీందర్‌రెడ్డి, రాధిక, రవి, మల్లయ్య, భాస్కర్, రమేశ్, సుజాత, నిర్మల, పద్మ, దివ్య తదితరులు పాల్గొన్నారు.

'యుద్ధభేరి సభ' విజయవంతం చేయాలి

- బీసీ సంఘం నాయకులు రాజు, నాగార్జున



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సోమయ్య, తదితరులు

వర్ధన్నపేట : హన్మకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో నేడు (ఆదివారం) తలపెట్టిన బీసీ రాజకీయ యుద్ధభేరి సభ విజయవంతం చేయాలని నాయకులు పూజారి రాజు, ఆరెల్లి నాగార్జున కోరారు. పట్టణంలో శనివారం ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో వారు మాట్లాడారు. దేశానికి స్వాతంత్య్రం వచ్చి 75 ఏళ్లు దాటినా బీసీలు విద్య, వైద్యం, ఉద్యోగం, ఉపాధి, ఇతర అన్ని రంగాల్లోనూ వెనుకబడి ఉన్నారని తెలిపారు. బీసీలకు జనాభా మేరకు 55 శాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు. రాజ్యాధికారం సాధించుకుంటేనే బీసీల బతుకుల్లో వెలుగులు నిండుతాయని చెప్పారు. మండలంలోని ఇల్లందలో సభ పోస్టర్‌ను మత్స్య పారిశ్రామిక సంఘం అధ్యక్షుడు చొప్పరి సోమయ్య ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమాల్లో నాయకులు మణిదీప్, రాజు, శేఖర్, నరేందర్, రాజేశ్, అనిల్, భీమరాజ్, స్వామి, నాగయ్య పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో వృక్షాలకు రక్షాబంధన్



చెట్టుకు రాఖీ కడుతున్న విద్యార్థినులు

ఖానాపురం : మండలంలోని బుధరావుపేట గ్రామంలోని మోడల్ స్కూల్‌లో శనివారం వృక్షాలకు రక్షాబంధన్ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థినులు చెట్లకు రాఖీ కట్టారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పెరక సునీత మాట్లాడారు. మొక్కలు నాటి సంరక్షించడాన్ని బాధ్యతగా భావించాలని విద్యార్థులకు సూచించారు. పర్యావరణాన్ని పరిరక్షించేలా పెద్దసంఖ్యలో మొక్కలు నాటి పరిరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. వృక్షాలతోనే మానవ మనుగడ సాధ్యమని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు వృక్షాలపై ఆవశ్యకతపై అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం వృక్షాలను సంరక్షించుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భూమ రాజేందర్, సైరా, రాధిక, రవికుమార్, రాజేంద్రప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం



విద్యార్థులతో విద్యాసంస్థల చైర్మన్ సుబ్బారావు, ప్రిన్సిపాల్ ప్రవీణ్‌కుమార్, ఉపాధ్యాయులు

నర్సంపేట : పట్టణంలోని గీతాంజలి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో శనివారం స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులను మరిపించేలా పాఠాలు బోధించి ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా గీతాంజలి విద్యాసంస్థల చైర్మన్ వేములపల్లి సుబ్బారావు మాట్లాడారు. ఉపాధ్యాయులు భావిభారత పౌరులను తీర్చిదిద్దే బాధ్యతతో ముందుకు సాగుతారని చెప్పారు. విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేయడంలో ఉపాధ్యాయులు కీలకమన్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా బోధించిన తీరును అభినందించారు. డీఈఓగా షిఫా మెహవిస్, ఎంఈఓగా పూజిత, చైర్మన్‌గా అయేషా, ప్రిన్సిపాల్‌గా అక్షితరెడ్డి, ఉపాధ్యాయులుగా 60 మంది వ్యవహరించారు. అనంతరం ప్రతిభ చాటిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గూడూరు ప్రవీణ్‌కుమార్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

రైలులో ప్రయాణికుడి మృతి

మహబూబాబాద్ రూరల్ : పశ్చిమ బెంగాల్‌కు చెందిన ప్రణబ్ కుమార్ ఘోష్ (52) సికింద్రాబాద్ నుంచి హౌరా వెళ్లే హౌరా రైలులో కుటుంబ సభ్యులతో కలిసి ప్రయాణిస్తూ నెక్కొండ రైల్వేస్టేషన్ దాటిన కొంత సమయం తర్వాత ఆయనకు గుండెపోటు వచ్చింది. రైల్వే ఉద్యోగులు 108కు సమాచారం అందించారు. సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని ప్రయాణికుడిని పరిశీలించి, మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

సన్మానం

ఆత్మకూరు : మండల ప్రత్యేక అధికారిగా విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమణ పొందిన రాజేందర్‌ను మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శనివారం అధికారులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. రాజేందర్ దంపతులకు శాలువాలు కప్పి పూలమాలలు వేసి సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, ఈజీఎస్ ఏపీఓ రాజిరెడ్డి, ఎంపీఓ విమల, కార్యదర్శి శ్వేత, రాజు, సిబ్బంది, రాజేందర్ బంధువులు, స్నేహితులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వివాహిత మృతి



జ్యోతి (ఫైల్)

చెన్నారావుపేట : చికిత్స పొందుతూ వివాహిత మృతి చెందిన ఘటన మండలంలోని లింగగిరిలో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన అనుముల జ్యోతి (42) తన కుమారుడు వంశీ ద్విచక్ర వాహనంపై నర్సంపేటకు వెళ్తుండగా శుక్రవారం గ్రామంలో ప్రధాన రహదారిపై సడన్ బ్రేక్ వేయడంతో వాహనంపై ఉన్న జ్యోతి రోడ్డుపై పడి తీవ్ర గాయాల పాలైంది. ఆమెను తొలుత నర్సంపేటలోని ఆస్పత్రికి, తదనంతరం పరిస్థితి విషమింగా ఉండడంతో వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. కాగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి జ్యోతి మృతి చెందింది. మృతురాలికి భర్త, ఇద్దరు పిల్లలున్నారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై రాజేశ్‌రెడ్డి తెలిపారు.